# అంతరంగ యాత్ర

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA   AUGUST 2018 - NOVEMBER 2018   Rs. 2/-   VOL. XIII   ISSUE 1

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ


## మీ అస్తిత్వం యొక్క మొత్తం స్వరూపాన్ని మీరు తెలుసుకోవాలి

ఒకరి ప్రశ్న: మానవుడి సమస్యలు పరిష్కరించాలంటే రావలసినది ఆర్థిక విప్లవం కానీ, సామాజిక విప్లవం కానీ కాదు. కావలసినది మత విషయకమైన విప్లవం అని మీ ప్రసంగంలో అన్నారని ఈ రోజు వార్తాపత్రికలో చదివాను. మత విషయకమైన విప్లవం అంటే మీ అర్థం ఏమిటి?

కృష్ణమూర్తి: మొట్టమొదట అసలు మతం అంటే మనం ఏమనుకుంటున్నామో చూద్దాం. మనలో చాలా మందికి మతం అంటే అసలు ఏమిటి? మతం అంటే ఫలానా అని చెప్పే ఒక సిద్ధాంతంగా కాదు. అసలు వాస్తవంలో ఏమిటి? చాలా మంది దృష్టిలో సర్వసాధారణంగా మతం అంటే కొన్ని కొన్ని మూఢ విశ్వాసాలూ, ఆచారాలూ, ఉపనిషత్తుల్లో, గీతలో, బైబిల్లో ఏం చెప్పారూ అనేవి. లేదా నిబద్ధీకరణం చెందిన మన మనసుల్లో నుంచి, హిందువులుగానో, క్రైస్తవులు గానో, కమ్యూనిస్టు ధోరణిలోనో రూపుదిద్దుకున్న మన మనసుల్లో నుంచి పుట్టుకొచ్చిన అనుభవాలతో, అభూత స్వప్నాలతో, ఆశలతో, ఊహలతో తయారు చేసిన దానిని మతం అని అనుకుంటాం. ఒక రకమైన నిబద్ధీకరణంతో ఆరంభమైన మనం, ఆ నిబద్ధతకు అనుగుణంగా ఉండే అనుభవాలనే పొందుతూ ఉంటాం. మతం అని మనం పిలుస్తున్నది అంతా ఏమిటంటే ప్రార్థనలు, కర్మకాండలు, అంధవిశ్వాసాలు, దేవుడిని ప్రత్యక్షం చేసుకోవాలనుకోవడం, ఆధిపత్యానికి తల వంచడం, అసంఖ్యాకమైన మూఢాచారాలూ. అంతే కదూ? అదేనా మతం అంటే? నిజంగా సత్యం ఏమిటి అన్నది తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నవారు ఇదంతా పూర్తిగా విసర్జించి పారేయాలి. వదిలివేయాలి కదూ? గురువుల ఆధిపత్యాన్ని, ఉపనిషత్తుల ఆధిపత్యాన్ని, తన స్వీయ అనుభవాల ఆధిపత్యాన్నీ అన్నింటినీ పూర్తిగా వదిలి వేయాలి. ఆ విధంగా ఆధిపత్యమంతటినీ తొలగించుకొని ప్రక్షాళితం అయింది కాబట్టి మనసు కొత్త దానిని ఆవిష్కరించుకోగలుగుతుంది. అంటే అర్థం మీరు హిందువుగానో, క్రైస్తవునిగానో, బౌద్ధునిగానో ఉండటం మానేస్తారు. అటువంటి వ్యవహారంలో ఉండే బుద్ధిహీనతను గ్రహించి దాని నుండి మీరు బయటపడాలి. అది మీరు చేస్తారా? ఎందుకంటే అట్లా చేస్తే ప్రస్తుత సమాజాన్ని మీరు ధిక్కరించినట్లవుతుంది. మీ ఉద్యోగం ఊడిపోవచ్చు. కాబట్టి భయం మీ మనసు మీద పెత్తనం వహిస్తుంది. అందుకని మీరు ఆధిపత్యానికి తల వంచుతూనే ఉంటారు.

మతం అని మనం ఇప్పుడు అంటున్నది మతం కానే కాదు. దేవుడంటే మనకు నమ్మకం ఉన్నదా, నమ్మకం లేదా అన్నది మన నిబద్ధీకరణం పైన ఆధారపడి ఉంటుంది. మీకు దేవుడంటే నమ్మకం ఉంటుంది. కమ్యూనిస్టుకు దేవుడు లేడు అనే దానిలో నమ్మకం ఉంటుంది. ఈ రెంటి మధ్యన ఏం భేదం ఉన్నది? వీరిద్దరిలో ఏ మాత్రం వ్యత్యాసం లేదు. ఎందుకంటే మీరు నమ్మటంలో శిక్షణ పొందారు. అతనికి నమ్మకుండా ఉండటంలో తర్ఫీదు ఇచ్చారు. కాబట్టి నిజంగా తరచి శోధించాలనుకునే వారు ఆ పద్ధతులన్నింటినీ సంపూర్ణంగా తిరస్కరించాలి. తిరస్కరించి తీరద్దా? ఇందులోని ప్రాధాన్యతను అంతటినీ అర్థం చేసుకున్నారు కాబట్టి తిరస్కరించి తీరాలి.

భద్రతాలేమి వల్ల, భయపడుతుండటం వల్ల, అంతర్గతమైన వెలితి వల్ల ఒక దేశంతోనో, ఒక సిద్ధాంతవాదంతోనో, దేవుని మీద విశ్వాసంతోనో మనం పూర్తిగా ఐక్యమై పోతాం. దీనివలన ఏం జరుగుతున్నదో ప్రపంచమంతటా కనిపిస్తూనే ఉన్నది. మతాలన్నీ ప్రేమను, సహోదర భావాన్ని ఇంకా ఇటువంటి వాటినీ ఒక పక్కన ప్రవచిస్తూనే మనిషిని మనిషి నుండి విడదీస్తున్నాయి. మీరు సిక్కులు, నేను హిందువుని, అతడు ముస్లిం, మరొకరు బౌద్ధులు. ఈ గందరగోళము, ఈ విభజనలూ, ఇవన్నీ చూసినప్పుడు మరో కొత్త రకమైన ఆలోచనా సరళి ఉండి తీరాలని మనం గ్రహిస్తాం. అయితే మనం హిందువులు గానో, క్రైస్తవులు గానో ఇంకా రకరకాలు గానో ఉండిపోయినంత వరకు కొత్త రకంగా ఆలోచించడమన్నది జరగదు అని స్పష్టంగా కనబడుతూ ఉన్నది. దీనంతటి నుండీ విముక్తమవ్వాలంటే మిమ్మల్ని – మీ అస్తిత్వం యొక్క మొత్తం స్వరూపాన్ని మీరు తెలుసుకొని తీరాలి. ఎందుకు అంగీకరిస్తుంటారో, ఎందుకు ఆధిపత్యాన్ని అనుసరిస్తారో గ్రహించి తీరాలి. అదంతా మీరు చాలా సుస్పష్టంగా చూడాలి. మీకు గెలుపు కావాలి. కష్టాలు మీద పడ్డప్పుడు ఆధారపడటానికి దేవుడంటూ ఒకడున్నాడని ఎవరయినా మీకు హామీ ఇవ్వాలి. నిజంగానే ఆనందంగా, సంతోషంగా ఉన్నవారు ఎవ్వరూ దేవుడిని గురించి తలచుకోనే తలచుకోరు. బాధల్లో, సంఘర్షణలో

ఉన్నప్పుడే దేవుడిని తలచుకుంటాం. అయితే ఈ బాధలను, సంఘర్షణను తయారు చేసుకున్నదీ మనమే. ఈ ప్రక్రియనంతా అవగాహన చేసుకోనంత వరకు ఊరికే దేవుడిని గురించి అన్వేషించడం భ్రాంతిలో పడవేస్తుందని నిస్సంశయంగా చెప్పవచ్చు.

అందుచేత నేను మాట్లాడుతున్న మతపరమైన విప్లవం అంటే ఏదో ఒక మతాన్ని పునరుద్ధరించడమో, సంస్కరించడమో కాదు. ఈ విప్లవం అంటే సకల మతాల నుండి, సమస్తమైన సిద్ధాంతవాదాల నుండి సంపూర్ణమైన విముక్తి. అంటే నిజమైన అర్థం ఏమిటంటే వీటిని తయారు చేసిన సమాజం నుండి విముక్తి. ఆకాంక్షా పరత్వం ఉన్న మనిషి మతచింతనాపరుడు అవలేడు. ఆకాంక్షాపరత్వం ఉన్న మనిషికి ప్రేమ అంటే తెలియదు. అతడు ప్రేమను గురించి మాట్లాడవచ్చు గాక. ఒకరు లౌకిక దృష్టిలో ఆకాంక్షపరులు కాకపోవచ్చు. అయితే తాను మహాత్ముడి నవాలనో, ఆధ్యాత్మిక రంగంలో గుర్తింపు పొందాలనో, పై లోకంలో ఫలితం రాబట్టాలనో కోరుకుంటుంటే అతనిలో ఆకాంక్షాపరత్వం ఉన్నట్లే. అందుచేత మనసు మంత్రాలను, పూజలను, నమ్మకాలను, అంధవిశ్వాసాలను, ఇంకా అటువంటి వాటిని అన్నింటినీ త్రోసి అవతల పారవేయడమే కాకుండా, అసూయ నుండి కూడా విముక్తి చెందాలి. మనిషి సంపూర్ణమైన స్వేచ్ఛను పొందడమే మతపరమైన విప్లవం, అప్పుడే అతడు జీవితాన్ని పూర్తిగా విభిన్నమైన దృష్టితో సమీపిస్తాడు. ఒక సమస్య తరువాత మరొక సమస్యను సృష్టించుకోవడం ఆపివేస్తాడు.

ఇవన్నీ వట్టి మాటలు అనో, ఇదంతా మేధావితనం అనో మీరు భావిస్తున్నారేమో. ఎందుకంటే, 'ఆకాంక్ష అనేది లేకపోతే నేను జీవితంలో ఏం చేయగలుగుతాను? సమాజం నన్ను నాశనం చేసేస్తుంది' అని మీలో మీరు అనుకుంటూ ఉన్నారు. సమాజం మిమ్మల్ని నాశనం చేస్తుందా అని నేను ప్రశ్నిస్తున్నాను. సమాజాన్ని అవగాహన చేసుకొని, ఆ సమాజాన్ని నిలబెడుతున్న ఈ ఆకాంక్షా పరత్వం, అసూయ, గెలుపు కోసం ప్రయాసపడటం, మతపరమైన మూఢ వాదాలు, విశ్వాసాలు, అంధాచారాలు అనే ఆ మొత్తం నిర్మాణ స్వరూపాన్ని అంతటినీ తిరస్కరించిన మరుక్షణమే మీరు సమాజంలో నుండి ఇవతలగా వచ్చేస్తారు. కాబట్టి సమస్య మొత్తాన్ని మళ్ళీ కొత్తదనంతో చూస్తారు. బహుశ అప్పుడు సమస్య అనేదే లేకపోవచ్చు. అసలు మీరు ఇదంతా కేవలం మాటల స్థాయిలోనే విన్నారేమో.

అప్పుడు తిరిగి రేపు అంతా యథాతథంగా పాత పద్ధతిలోనే కొనసాగిస్తారు. గీతనో బైబిలునో చదువుకుంటారు. ఏ గురువు వద్దకో, మతాచార్యుల వద్దకో వెళ్తారు. మళ్ళీ అన్నీ మామూలే. ప్రసంగం అంతా విని మేధాపరంగా, వాచ్యంగా దీనిని మీరు ఆమోదించవచ్చు. అయితే మీ జీవితం దీనికి వ్యతిరేక దిశలో పోతూ ఉంటుంది. కాబట్టి మీరు మరొక సంఘర్షణను తయారు చేసుకుంటారు. అందుచేత మీరు అసలు వినకపోవడమే మంచిది. ఎందుకంటే ప్రస్తుతం మీకు ఉన్న సంఘర్షణలు, సమస్యలు చాలవన్నట్లు మరొకటి అదనంగా చేర్చడం ఎందుకు. ఇక్కడ కూర్చుని, చెప్తున్న మాటలన్నీ వినడం చాలా బాగుంటుంది. అయితే దీనితో మీ వాస్తవ జీవితానికి ఏ సంబంధమూ లేనప్పుడు, మీరు చెవులు మూసుకొని ఉంచుకోవడమే చాలా మంచిది. ఎందుకంటే సత్యం విన్నాక, అట్లా జీవించకపోతే, అప్పుడు మీ జీవితం ఘోరమైన గందరగోళంలో పడిపోతుంది. దుఃఖ భూయిష్టము, చీకాకులమయమూ అవుతుంది. నిజానికి మీ జీవితం అట్లాగే ఉన్నది.

*(న్యూ ఢిల్లీలో 10 అక్టోబరు 1956న ఇచ్చిన ప్రసంగం నుండి)*

# సమస్యను అవగాహన చేసుకోవాలనే ఉద్దేశ్యం మనకు నిజంగా ఉన్నదా?

మన సమస్యలకు ఒక పరిష్కారం వెతికి పట్టుకోవాలని ఎంత ఆత్రపడుతుంటాం! పరిష్కారం వెతికే ఆ తొందరలో అసలు సమస్యను గురించి సరిగ్గా విచారించలేము. సమస్యను మౌనంగా పరిశీలించడానికి అది అడ్డు తగులుతుంది. అసలు ప్రధానమైన విషయం సమస్య తప్ప పరిష్కారం కాదు. గట్టిగా చూస్తే పరిష్కారాన్ని కనిపెట్టవచ్చు. అయితే సమస్య మాత్రం అట్లాగే కొనసాగు తుంది. ఎందుకంటే సమస్యకూ పరిష్కారానికీ ఏ సంబంధమూ లేదు. మనం వెతుకుతున్నది సమస్య నుండి పారిపోయే మార్గం కోసం. పరిష్కారం అనేది వట్టి పైపై చికిత్స. దానివల్ల సమస్యను అవగాహన చేసుకోవడం కుదురదు. అన్ని సమస్యలకు మూలస్థానం ఒక్కటే. ఆ మూలస్థానాన్ని అర్థం చేసుకోకుండా సమస్యలను పరిష్కరిద్దామని చూడటం వల్ల గందరగోళము, బాధ ఎక్కువవు తాయి. అసలు మొదట సమస్యను అవగాహన చేసుకోవాలనే ఉద్దేశ్యం మనకు నిజంగా ఉన్నదా లేదా, అసలు ఈ సమస్య లేవీ లేకుండా ఉండాలనే ఆవశ్యకతను గ్రహించామా అనే సంగతి స్పష్టం చేసుకోవాలి. అప్పుడే సమస్యలను తయారు చేస్తున్న కర్తను సమీపించగలుగుతాము. సమస్యల నుంచి విముక్తి లేకుండా ప్రశాంతత ఉండదు. సంతోషంగా ఉండాలంటే ప్రశాంతి అవసరం. అయితే అదే గమ్యం అని కాదు. పిల్లుగాలులు వీచడం ఆగిపోయినప్పుడు నీటి మడుగు నిశ్చలంగా ఉన్నట్లు సమస్యలు సమాప్తం అయినప్పుడు మనసు కూడా నిశ్చలమవుతుంది. అయితే మనసును నిశ్చలంగా చేసి వేయడం సాధ్యమవదు. అట్లా గనుక చేస్తే మనసు మృతప్రాయమే. మురిగిపోయిన నీటిగుంట అవుతుంది. ఇది కనుక స్పష్ట మయిందంటే సమస్యలను తయారు చేసే కర్తను పరిశీలించవచ్చు. ఈ పరిశీలన మౌనంగా జరగాలి. బాధా సౌఖ్యాలను దృష్టిలో పెట్టుకొని ముందుగానే నిర్ణయించుకున్న ఒక పథకం ప్రకారంగా జరగకూడదు.

*('కమెంటరీస్ ఆన్ లివింగ్' నుండి)*

# వ్యక్తి లోలోపల విప్లవం

ఒకరి ప్రశ్న: మాలో చాలా మందికి ప్రతి రోజూ తప్పనిసరిగా చేయవలసిన ఒకటే మాదిరి పనులతో విసుగొచ్చేసింది. అయితే ఈ పనులు, అంటే ఈ ఉద్యోగాలే మా జీవనాధారం. చేస్తున్న పనులతోనే సంతోషంగా జీవించడం మాకు వీలవుతుందా?

కృష్ణమూర్తి: నిజమే, ఆధునిక నాగరికత వ్యక్తిగతంగా మనకు ఏ మాత్రం ఇష్టంలేని పనులను మన చేత బలవంతంగా చేయిస్తున్నది. ప్రస్తుతం ఉన్న సమాజపు నిర్మాణం పోటీలు, నిర్దాక్షిణ్యత, యుద్ధం అనే వాటిని ఆధారం చేసుకొని ఉన్నది. ఈ సమాజానికి కావలసినది – ఉదాహరణకి – ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులూ అనుకుందాం. ప్రపంచంలో ప్రతి చోటా వీళ్ళ అవసరమే కనబడుతున్నది. ఎందుకంటే యుద్ధ పరికరాలను వీళ్ళు బాగా అభివృద్ధి చేయగలుగుతారు. కాబట్టి ఒక వ్యక్తిని ఇంజనీరుగానో, శాస్త్రజ్ఞుని గానో తయారుచేయడానికే విద్యా విధానమంతా నడుం కట్టుకొని కూర్చుంది. అతను వీటికి అర్హుడా కాదా అనే సంగతి ఎవరికీ అక్కర్లేదు. ఇంజనీరు అవడం కోసం విద్య అభ్యసిస్తున్న వారికి ఇంజనీరు అవడం అసలు ఇష్టమే లేకపోవచ్చు. అతనికి చిత్రకళ మీదో సంగీతం మీదో మరో దాని మీదో అభిరుచి ఉండచ్చు. అయితే పరిస్థితులు – విద్యా విధానం, కుటుంబ సంప్రదాయం, సమాజపు ఒత్తిడులు మొదలైనవన్నీ అతడిని ఇంజనీరే అయి తీరాలని ఆదేశిస్తాయి. ఈ విధంగా ఒకే మాదిరి అయిన పనులను మనం తయారుచేస్తున్నాం. చాలా మంది అందులో చిక్కుకొని పోతున్నారు. ఇక ఆ తరువాత నిస్పృహ, బాధ, అసంతృప్తి వారిని జీవితాంతం వెంటాడుతూ ఉంటాయి. ఇది అందరికీ తెలిసినదే.

ముఖ్యంగా ఇది విద్యా విధానానికి సంబంధించినది. అవును కదూ? ఒక కొత్త రకమైన విద్యా విధానాన్ని, అంటే బోధకునికి, విద్యార్థికి ఇద్దరికీ కూడా తమ చేస్తున్న పని మీద ప్రేమ ఉండే విద్యా విధానాన్ని మనం తీసుకురాగలమా? ప్రేమ – ఆ మాటను అచ్చంగా ఆ అర్థం లోనే అంటున్నాను. అయితే ఎంత సేపూ గెలుపు, అధికారము, పదవి – ప్రతిష్ఠలు సాధించడానికి ఒక సాధనంగా మీ పనిని మీరు ఉపయోగించుకుంటుంటే ఆ పని మీద మీకు ప్రేమ ఉండదు. ఇప్పుడు ఉన్న తీరులో ఉన్న ఈ సమాజం బొత్తిగా విసుగెత్తిపోయిన, ప్రతి రోజూ చేసే పనుల్లో చిక్కుకొనిపోయిన వ్యక్తులనే తయారు చేస్తున్నదనడంలో సందేహం లేదు. కాబట్టి పూర్తిగా భిన్నమైన వాతావరణాన్ని తీసుకుని రావాలంటే విద్యార్థులు, పిల్లలు తాము చేసేది ప్రేమతో చేయగలిగే వాతావరణంలో పెరగాలంటే విద్యా విధానంలోను, ఇతర విషయాల్లోను కూడా ఒక బ్రహ్మాండమైన విప్లవం రావలసిన అవసరం ఉన్నది. లేదూ?

ప్రస్తుత పరిస్థితుల్లో, ఒకే రకమైన పనులు ప్రతి రోజూ చేయడం, విసుగెత్తి పోవడం మనం భరించవలసి వస్తున్నది. అందుకని రకరకాల మార్గాలలో పారిపోవడానికి ప్రయత్నిస్తుంటాం. వినోద కాలక్షేపాలు, టెలివిజన్, రేడియో, పుస్తకాలు, మతము అని మనం పిలిచేది – వంటి వాటిలో పడి పారిపోవాలని ప్రయత్నిస్తూ ఉంటాం. అందువల్ల మన జీవితాలు డొల్లగా శూన్యంగా మందకొడిగా తయారవుతాయి. ఇట్లా డొల్లగా ఉండటం వల్ల ఆధిపత్యానికి తల ఒంచడం పెరుగుతుంది. దానివల్ల మనం లోకంతో పాటు కలిసి ఉన్నామనే భావం, కొంత బలము, ఒక స్థానము మనకు దొరుకుతాయి. ఇదంతా మనకు హృదయ గతంలో తెలుస్తునే ఉంటుంది. కాని ఇందులో నుంచి బయట పడటం చాలా కష్టం. ఎందుకంటే బయట పడాలంటే కావలసినది అతి సాధారణమైన భావోద్వేగం కాదు. దీనికి అత్యంత ఆవశ్యకమైనవి ఆలోచన, శక్తి, కృషి.

అందుచేత, ఒక నూతన ప్రపంచాన్ని కనుక మీరు తయారు చేయాలని అనుకుంటూ ఉంటే మానవులు అనుభవించిన ఈ భయంకరమైన యుద్ధాలు, ఈ క్షోభ, ఈ ఘోరాలు చూశాక తప్పక నవ్య ప్రపంచాన్ని నిర్మించి తీరాలి. అంటే అప్పుడు ఒక మత విషయైక విప్లవం మనలో, మన ప్రతి ఒక్కరిలో వచ్చి తీరాలి. ఆ విప్లవం ఒక నవ్య సంస్కృతిని, ఆసాంతమూ కొత్తదైన ఒక మతాన్ని – ఆ మతం ఆధిపత్యంతో కూడిన, పురోహితుల ఆచార విధులతో కూడిన, మూఢ విశ్వాసాలు – కర్మకాండలతో కూడిన మతం కాదు – ఒక విభిన్నమైన మతాన్ని తీసుకొని వస్తుంది. అన్ని విధాలా భిన్నమైన ఒక సమాజాన్ని తయారు చేయాలంటే ఈ మత విషయైక విప్లవం వచ్చి తీరాలి. అంటే వ్యక్తి లోలోపల జరిగే విప్లవం. అంతే తప్ప నియంతృత్వాన్ని, బాధలను, భయాలను పెంచి పోషించే ఆ ఘోరమైన రక్తపాతాల విప్లవం కాదు. ఒక నూతన ప్రపంచాన్ని అంటే పూర్తిగా భిన్నమైన అర్థంలో కొత్త దానిని మనం నిర్మిస్తే అప్పుడది మన అందరి ప్రపంచం అవుతుంది. ఒక జర్మన్ ప్రపంచమో రష్యను ప్రపంచమో హిందూ ప్రపంచమో అవకూడదు. ఎందుకంటే మనమంతా మానవులం. ఈ భూమి మనది.

అయితే దౌర్భాగ్యం ఏమిటంటే మనలో చాలా తక్కువ మంది వీటిని గురించి లోతుగా ఆలోచిస్తారు. ఎందుకంటే దీనికి ప్రేమ ఆవశ్యకమవుతుంది. భావోద్వేగం కాదు, ఆవేశతత్వం కాదు కావలసినది. ప్రేమ చాలా దుర్లభమైనది. భావోద్వేగంతోనూ ఆవేశంగానూ ఉండే వారు సాధారణంగా చాలా క్రూరంగా ఉంటారు. పూర్తిగా భిన్నమైన ఒక కొత్త సంస్కృతిని తీసుకొని రావాలంటే మనలో ప్రతి ఒక్కరిలోను ఈ మతపరమైన విప్లవం జరగాలని నాకు అనిపిస్తున్నది. అంటే అర్థం స్వేచ్ఛ పొందాలని. అన్ని మతసూత్రాల నుండి, అంధ విశ్వాసాల నుండి మాత్రమే కాదు. వ్యక్తిగతమైన ఆకాంక్షాపరత్వం నుండి, స్వార్థపూరిత కార్యకలాపాల నుండి కూడా స్వేచ్ఛ పొందాలి. అప్పుడు మాత్రమే ఒక నూతన ప్రపంచ ఆవిర్భవించ గలుగుతుంది.

*(15 సెప్టెంబరు 1956లో హాంబర్గులో ఇచ్చిన ప్రసంగం నుండి)*

# మన నిత్యజీవితాన్ని ఎట్లా జీవించాలి?

ఒకరి ప్రశ్న: మా అందరిలోనూ ఏవో భయాలు – యుద్ధాన్ని గురించో, మా పిల్లలలో కనబడుతున్న దౌర్జన్యం గురించో, అప్రయోజకులైన రాజకీయవేత్తల పాలిట పడ్డామే అనో – ఇలా రకరకాల భయాలు మా జీవితాలను ఎప్పుడూ అతలాకుతలం చేస్తూ ఉంటాయి. ఇటువంటి ఈ జీవితాన్ని మేము ఏ విధంగా ఎదుర్కోవాలి?

కృష్ణమూర్తి: ఎట్లా ఎదుర్కొంటారు? ప్రపంచం రోజు రోజుకూ హింసా పూరితంగా తయారవుతున్నదనే విషయం మనం ఒప్పుకొని తీరాలి. అది స్పష్టంగా కనబడుతున్నది. యుద్ధ ప్రమాదం కూడా స్పష్టంగా కనబడుతూనే ఉన్నది. మన పిల్లలు హింసాత్మకంగా తయారవు తున్నారనే ఒక కొత్త వైపరీత్యం కూడా మన కళ్ళ ముందు ఉన్నది. కొంత కాలం కిందట భారతదేశంలో పిల్లల తల్లి అయిన ఒక ఆవిడ మా వద్దకు రావడం నాకు గుర్తు వస్తున్నది.

భారతీయ సంప్రదాయం ప్రకారం తల్లి అంటే చాలా గౌరవనీయమైన స్థానంలో ఉండే వ్యక్తి. ఈ తల్లిని తన పిల్లల ప్రవర్తన దిగ్భ్రాంతిలో ముంచింది. పిల్లలు ఆమెను కొడుతున్నారట. భారతదేశంలో కనీవినీ ఎరగని సంగతి. అంటే ఈ హింస, దౌర్జన్యం ప్రపంచమంతా వ్యాపిస్తున్నాయి. ఇక ఈ ప్రశ్న అడిగినవారు అన్నట్లుగా ఉద్యోగం పోతుందనే భయం ఒకటి ఉన్నది. ఇవన్నీ చూస్తూ, ఇదంతా తెలిసి, ప్రస్తుతం ఇట్లా ఉన్న ఈ జీవితాన్ని మీరు ఏ విధంగా ఎదుర్కోవాలి?

నాకు తెలియదు. నేను ఎట్లా ఎదుర్కోవాలో నాకు తెలుసు. మీరు ఎట్లా ఎదుర్కుంటారో నాకు తెలియదు. మొట్ట మొదటగా – జీవితం అంటే ఏమిటి? ఎక్కడ చూసినా దుఃఖం, మితిమీరిన జనాభా, అప్రయోజకులైన రాజకీయ వేత్తలు, రకరకాల మాయలు, మోసాలూ, చిత్తశుద్ధి లేకపోవడం, లంచగొండితనం వంటివి నిరాఘాటంగా సాగుతున్న ప్రపంచంలో మన అస్తిత్వం అన్నది ఏమిటి? ఇదంతా ఎట్లా ఎదుర్కోవాలి? అందుకు మొదట తప్పనిసరిగా తరచి చూడవలసినది జీవించడం అంటే అర్థం ఏమిటి అనేది. ప్రస్తుతం ఉన్న ప్రపంచంలో జీవించడం అంటే ఏమిటి? మన నిత్య జీవితాన్ని అసలు ఎట్లా గడపాలి? సిద్ధాంత రూపేణా కాదు, తాత్త్విక యోచనగా కాదు. ఆదర్శవాదంగా కాదు. అసలు వాస్తవంలో మన నిత్య జీవితాన్ని ఎట్లా జీవించాలి?

మనం కనుక పరీక్షిస్తే, బాగా గాఢమైన స్పృహతో గమనిస్తే జీవితం ఒక నిరంతరమైన సమరం, నిరంతరమైన పోరాటం, ప్రయాస మీద ప్రయాస పడుతూ ఉండటం. ఉదయం నిద్ర లేవడం ఒక ప్రయాస. ఏం చేయాలి మనం? తప్పించుకొని పారిపోవడం సాధ్యం కాదు. ఈ ప్రపంచంలో జీవించడం అసాధ్యం అని అనుకున్న చాలా మంది అన్నింటినీ వదిలేసి ఎక్కడో హిమాలయాల్లోకి వెళ్ళి పోయి అంతర్ధానమయ్యారు. అదంతా కేవలం తప్పించుకోవడం. యదార్థాన్నుండి పారిపోవడం. ఇది కూడా సమష్టిగా జీవించే సహజీవన సంఘాల్లో చేరి కలిసి పోవడం వంటిదే. బోలెడు ఆశ్రమాలు, ఆస్తులూ ఉన్న గురువును చేరి అందులో పడి మునిగిపోవడం వంటిదే. వీళ్ళంతా నిత్యజీవితపు సమస్యలను పరిష్కరించు కోరు. సమాజంలో రావలసిన మార్పు, మానసికమైన విప్లవాలను గురించి లోతుగా శోధించరు. వీటి నుంచి పారి పోతారు. ఇక మనం – మనమూ ఇట్లా తప్పించుకొని పారిపోకుండా, ఈ ఉన్న ప్రపంచంలోనే నిజంగా జీవిస్తూ ఉంటే – అప్పుడు మనం ఏం చేయాలి? మన జీవితాలను మార్చుకోగలమా? మొత్తం జీవితంలో సంఘర్షణ అనేది లేకుండా చేసుకోగలమా? ఎందుకంటే సంఘర్షణ కూడా హింసలో ఒక భాగమే. అది లేకుండా చేయడం సాధ్యమేనా?

మన జీవితాలకు ఆధారం ఏమిటీ అంటే ఏదో ఒక గొప్పదనాన్ని సాధించాలనే పోరాటం. ప్రయాసా, పోరాటమూ.

ఈ ప్రపంచంలో నివసిస్తున్న మనుష్యులం మనం. మనల్ని మార్చుకో గలమా? అదే అసలైన ప్రశ్న. సమూలంగా మనోతత్వంలోనే పరివర్తన తీసుకొని రాగలమా? కాలక్రమేణా వచ్చే పర్యవ సానంగా కాదు. కాలానికి కట్టుబడకుండా, లోతుగా ఆలోచించేవారికి, నిజమైన ఆధ్యాత్మికులకు రేపు అనేది ఉండదు. రేపు లేదు అని అనడం చాలా కఠిన వాక్యం. ఇవాళ్టి రోజును సంరంభంతో పూజించడం అన్నది మాత్రమే ఉన్నది. ఈ జీవితాన్ని ప్రతి రోజూ పరిపూర్ణంగా యదార్థంగా జీవించగలమా? మన బాంధవ్యాలలో పరివర్తన తేగలమా? అసలు సమస్య అదీ. సమస్య ప్రపంచం ఎట్లా ఉన్నదీ అని కాదు. ఎందుకంటే ప్రపంచం అంటే మనమే. దయచేసి ఇది గ్రహించండి. ప్రపంచం అంటే మీరు. మీరు అంటే ప్రపంచం. ఇది స్పష్టంగా కనబడుతున్న, భయంకరమైన వాస్తవం. ఆసాంతంగా ఎదుర్కోవలసిన ఒక పెద్ద సమస్య. అంటే ఎంతో అసహ్యమైనవి అనేకం ఉన్న ఈ లోకం అంటే మనమే అనీ, మనకూ అందులో భాగస్వామ్యం ఉన్నదనీ, ఇదంతా ఇట్లా ఉండటంలో బాధ్యత మన పైన కూడా ఉన్నదనీ, మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న దానికి, ఆఫ్రికాలో జరుగుతున్న దానికి, ప్రపంచమంతటా జరుగుతున్న మతిలేని వ్యవహారాలన్నింటికీ మనమూ బాధ్యుల

మేనని గ్రహించడం. మన తాతలు, మన ముత్తాతలు చేసిన క్రియలకు – బానిసత్వం, వేలకొద్దీ యుద్ధాలు, సామ్రాజ్యాల్లోని క్రూరత్వం – మనం వీటికి బాధ్యులం కాక పోవచ్చును. కానీ మనమూ అందులోని వాళ్ళవే. మన బాధ్యతను మనం గ్రహించకపోతే, అంటే మన సమస్త బాధ్యతను, మనం చేసే పనులకు, ఆలోచనలకు, ప్రవర్తనకు మన బాధ్యతను మనం గుర్తించకపోతే అప్పుడు బొత్తిగా ఏ ఆశా లేనట్లే. లోకం సంగతి తెలుసు కాబట్టి, వ్యక్తిగతంగా విడివిడిగా మనం ఈ ఉగ్రవాదం అనే సమస్యను పరిష్కరించ లేమని తెలుసు కాబట్టి. అది ప్రభుత్వాల సమస్య. పౌరులకు భద్రత, రక్షణ కల్పించడం వారి విధి. అయితే అది వారు లక్ష్యపెట్టడం లేదు. తమ ప్రజలను రక్షించుకోవాలనే సంగతి ప్రతి ప్రభుత్వమూ కనుక నిజంగానే పట్టించు కుంటే అప్పుడు యుద్ధాలు ఉండవు. కాని ప్రభుత్వాలకు కూడా మతిస్థిరత్వం పోయినట్లే కనబడుతున్నది. వాళ్ళకు కావలసినది అల్లా పార్టీ రాజకీయాలు. వారి అధికారం, వారి పదవులు, వారి పలుకుబడి – అవీ వారికి కావలసినవి. ఆ నాటకాలు అన్నీ మీకు తెలుసు.

అందుచేత కాలాన్ని లెక్కలోకి తీసుకోకుండా, అంటే రేపు గురించి, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా, ఇవాళే అత్యంత ప్రధానం అన్నట్లుగా మనం జీవించగలమా? అంటే అర్థం – మన ప్రతిస్పందనల ఎడల, మనలోని గందరగోళం ఎడల అశేషమైన జాగరూ కతతో ఉండాలి. మన పైన మనమే ఒక పరమావేశాన్ని ప్రయోగించుకోవాలి. మనం చేయగలిగిన పని ఇదొక్కటేగా కనబడుతున్నది. ఇది కనుక మనం చేయకపోతే మానవుడికి భవిష్యత్తు లేదు.

పత్రికలలో వస్తున్న పతాక శీర్షికలను మీరు చూస్తున్నారో లేదో నాకు తెలియదు – యుద్ధం కోసం జరుగుతున్న సన్నాహా లను గురించి. సన్నాహాలు జరుగుతు న్నాయంటే యుద్ధం వచ్చి తీరుతుందన్న మాటే. వంటకాలు తయారవుతున్నట్లుగా. ప్రపంచంలోని సామాన్య ప్రజలకు ఈ సంగతి పట్టినట్లుగా లేదు. మారణ యుధాల తయారీలో మేధాపరంగా, వైజ్ఞానికంగా పాల్గొంటున్న వాళ్ళు కూడా లక్ష్యపెట్టడం లేదు. వాళ్ళకు కావలసినదల్లా తమ వృత్తిలో పైకి పోవడం. తమ ఉద్యోగాలు, తమ పరిశోధనలూ. చాలా సామాన్య పౌరులుగా లెక్కించబడే మనలాంటి వాళ్ళం, మధ్య తరగతి అని పిలవబడే మనం కూడా కనుక లక్ష్యపెట్టక పోతే మాత్రం ఇక మన మందరం నడి సముద్రంలో దూకినట్లే. ఇందులోని విషాదం ఏమిటంటే మనం ఇది లెక్క చేస్తున్నట్లుగా కనబడటం లేదు. అందరం కలిసి ఒకచోట చేరడం, కలిసి ఆలోచించడం, కలిసి పనిచేయడం లేనే లేదు. సంస్థల్లోను, సభల్లోను చేరడానికి మాత్రం చాలా ఉత్సాహం చూపుతాం. అవి ఈ యుద్ధాలను, ఈ నరికి పోగులు పెట్టుకోవడాలను ఆపు చేస్తాయని ఆశపడతాం. ఇంతవరకు అవి ఏమీ చేయలేదు. సభలు, సంస్థలు వీటిని ఆపడం అనేది జరగదు. మానవ హృదయమే, మానవ మస్తిష్కమే అసలు ఈ పనులను చేయిస్తున్నది. ఇవి ఆవేశంతో అంటున్న మాటలు అని దయచేసి అనుకోకండి. నిజంగానే చాలా గొప్ప ఉపద్రవాన్ని మనం ముఖాముఖిగా ఎదుర్కోబోతున్నాం. వీటిలో పాల్గొంటున్న చాలా ప్రముఖులైన వారిని మేము కలుసుకున్నాం. వారు ఈ విషయంలో చాలా నిర్లక్ష్య వైఖరితో ఉన్నారు. మనం కనుక ఇది పట్టించు కున్నట్లయితే, మన నిత్యజీవితాన్ని సవ్యంగా గడుపుతే, ప్రతి రోజూ మనం ఏం చేస్తున్నామనే స్పృహ మనలో ఉంటే – అప్పుడు భవిష్యత్తు కొంత ఆశాజనకంగా ఉంటుంది.

*('మీటింగ్ లైఫ్' నుండి)*

# మనసు వేగం తగ్గించడం

కట్టి పడేసి ఆపడం ద్వారా కాకుండా మరో విధంగా తన వేగాన్ని తగ్గించుకోవడం మనసుకు సాధ్యపడుతుందా?

కారులో చాలా వేగంగా పోతున్నప్పుడు చుట్టూ ఉండే దృశ్యాలు మసక మసగ్గా కనిపిస్తాయి. నడుస్తూ వెళుతున్నప్పుడు ఉండే వేగంలో మాత్రమే చెట్లను, పక్షులను, పూలను వివరంగా పరిశీలించగలుగుతాము. మనసు వేగం తగ్గించుకున్నప్పుడు స్వీయజ్ఞానం కలుగుతుంది. అంటే అర్థం వేగం తగ్గించమని మనసు మీద ఒత్తిడి ప్రయోగించడం కాదు. నిర్బంధం వల్ల ప్రతిరోధించడం బయలుదేరుతుంది. మనసు వేగాన్ని తగ్గించడానికి ఈ విధంగా శక్తిని వృథా చేయడం జరగకూడదు.

*('మన జీవితాలు' నుండి)*

ఆలోచన తనను మెరుగు పరచుకోవడం కోసం, తనలో పరివర్తన కోసం, తన అభివృద్ధి కోసం తపన పడుతున్నంత వరకు సంఘర్షణ, తనలో తనకు వైరుధ్యము తప్పవు. అందుచేత నన్ను నేను అర్థం చేసుకోనంత వరకు బాధలు, సంఘర్షణలు తప్పవు అనే సంగతి సుస్పష్టంగా చూడవచ్చును.

"మన జీవితాలు – జిడ్డు కృష్ణమూర్తి వాఖ్యానాలు"

**మూడు భాగాలు ఇప్పుడు ఒకే సంపుటంగా వెలువడింది. ప్రగతి ప్రచురణలు అందంగా తయారు చేసిన ఈ 748 పుటల గ్రంథం వెల రూ. 580/–, అనువాదం: అబ్బూరి ఛాయాదేవి.**

# కృష్ణమూర్తి ఫౌండేషన్ ఇండియా తెలుగు సమావేశాలు
## జిడ్డు కృష్ణమూర్తి బోధనలు, జీవన సమస్యల యెడల అతని దృక్పథం

జిడ్డు కృష్ణమూర్తి బోధనలను మీరు లోతుగా శోధించేందుకు వీలుగా, కృష్ణమూర్తి ఫౌండేషన్ ఇండియా, వసంత విహార్ వారు తొలి సారిగా తెలుగు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో తెలుగు సబ్‌టైటిల్సుతో కూడిన కృష్ణమూర్తి ప్రసంగాల విడియో స్క్రీనింగ్, ఆయన రచనలలోని విషయాలను అందరూ కలిసి పఠించడం, అతిథి వక్తల ప్రసంగాలు, సమావేశానికి వచ్చినవారి నడుమ తెలుగులో సంవాదాలు ఉంటాయి. ఈ సమావేశాలు 2018 ఆగస్టు నెలలో 25 (శనివారం), 26 (ఆదివారం) తేదీలలో కృష్ణమూర్తి ఫౌండేషన్ ఇండియా వారి ప్రధాన కేంద్రమైన వసంత్ విహార్‌లో నిర్వహించబడతాయి.

పాల్గొనే వారి సంఖ్యను 100కు కుదించడం జరిగింది. బయటి ప్రాంతాల నుండి వచ్చే వారికి వసంత విహార్‌లోను, థియొ సాఫికల్ సొసైటీలోను బస ఏర్పాటు చేయబడుతుంది. చెన్నై నుండి పాల్గొనే వారు వారి ఇళ్ళ నుండి రావచ్చును. లేదా బసకు తమ స్వంత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకో వచ్చును.

మొత్తం రెండు రోజుల కార్యక్రమానికి విరాళం ఈ విధంగా ఉంటుంది.

వసంత విహార్‌లో బస చేసేవారికి – రు. 1500/–

పగటి వేళ మాత్రమే హాజరయే వారికి – రు. 1000/–

మరిన్ని వివరాలకు మరియు నమోదు చేసుకునేందుకు ఈ–మెయిల్ చేయండి: kfitelugugathering@gmail.com.

నమోదు ఆగస్టు 5, 2018న ముగియనుంది.

వసంత విహార్‌లో బస చేసేవారికి విరాళంలో భాగంగా బస, ఆహారం (టీ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం), అధ్యయన సాహిత్యం ఉంటాయి.

పగటి వేళ మాత్రమే పాల్గొనే వారికి విరాళంలో భాగంగా మధ్యాహ్న భోజనం, అధ్యయన సాహిత్యం ఉంటాయి.

గదుల లభ్యత పరిమితం కాబట్టి మొదట నమోదు చేసుకున్నవారికి బస కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుంది. అలాగే కొన్ని గదులను ఇతరులతో పంచుకోవలసి ఉంటుంది.

ఇక్కడ ఎక్కవ రోజులు ఉండాలనుకునే వారు సమావేశాలకు ఒక రోజు ముందు రావచ్చు. లేదా తరువాత రెండు రోజులు ఉండవచ్చు. అయితే బస కేవలం అధ్యయనం, రిట్రీటుల కోసం మాత్రమే, వ్యక్తిగత పనుల కోసం కాదు. ఒకటి రెండు రోజులు అదనంగా బస చేయాలనుకునే వారు చెల్లించవలసిన విరాళం రోజుకు రు. 750/– ఉంటుంది.

పాల్గొనాలని అనుకునేవారు ఫారాలను పూర్తి చేసి విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా (నమోదు ఫారమ్ అందుకున్న తరువాత బేంకు వివరాలను అందజేస్తాం) లేదా చెక్ / డిమాండు డ్రాఫ్టు రూపంలో చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలి.

మరిన్ని వివరాలకు సంప్రదించండి:

**కృష్ణమూర్తి ఫౌండేషన్ ఇండియా**
124 గ్రీన్‌వేస్ రోడ్
ఆర్ ఏ పురం
చెన్నయి – 600028
టెలిఫోన్లు : 044–24937596, 24937803
ఈ–మెయిల్:
kfitelugugathering@gmail.com.

*Published in August, December & April*

Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliveral please return to :*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64,65)
Greenways Road, Chennai - 600 028.
Tel : 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64,65) Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*